క్లుప్తంగా

జగనన్న కాలనీలో శంకుస్థాపనలు



పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడు గ్రామం జగనన్న కాలనీలో శుక్రవారం 26 మంది లబ్ధిదారులు సామూహికంగా శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, సర్పంచ్ వేమవరపు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల కోటేశ్వరరావు, మాగులూరి అనిల్, కంకణాల శివాజీ, బత్తుల రాజేంద్ర పాల్గొని, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

క్రోసూరు: క్రోసూరు, అచ్చంపేట మండల కేంద్రాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం.బసవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా క్రోసూరు 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని క్రోసూరు, అచ్చంపేట మండల కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. కావున వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



నకరికల్లు: నకరికల్లు ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకోవడంతో కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఆయనను సన్మానించారు. పుష్ప గుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకొని, ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని సిబ్బంది ఎంపీడీఓను కొనియాడారు. తనకు సహకరించిన ఉన్నతాధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ ఎస్సీ కాలనీలో అభినందన ఆర్కాన్ అండ్ నీడ్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, కథల పుస్తకాలు, విద్యా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కె.సురేంద్ర బాబు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమవంతుగా తోడ్పాటు అందిస్తున్నామన్నారు. సభ్యులు మన్నం కోటేశ్వరరావు, పి.రామారావు, బక్కారాజు తదితరులు పాల్గొన్నారు.

'భూ రక్ష' పథకంపై సర్వేయర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

పెదకూరపాడు: మండల పరిధిలోని గ్రామ సర్వేయర్లకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి పాల్గొని, మాట్లాడారు. రైతులకు సర్వే ఉపయోగాలు, దశల వారీగా సర్వే విధానం, రైతులకు నోటీసులు ఇవ్వడం..ఇలా అనేక అంశాలపై సర్వేయర్లు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని ఖచ్చితత్వంతో సర్వే చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్షమారాణి, జిల్లా సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సత్కారం



అమరావతి: గణతంత్ర దినోత్సవానికి ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన అమరావతి తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సూరేపల్లి రాజశేఖర్‌ను శుక్రవారం మల్లాది గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అభినందించి సన్మానించారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీచైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు శాలువా కప్పి సత్కరించారు.

నోటరీ పొడిగింపు

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది జూపల్లి శేషయ్యకు రెండోసారి నోటరీని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 23 సంవత్సరాలుగా స్థానిక కోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నట్లుగా చెప్పారు. 2012లో ప్రభుత్వం మొదటిసారి తనకు నోటరీగా అవకాశం ఇవ్వటంతో అప్పటి నుంచి సేవలు కొనసాగిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముంగిట్లో పెళ్లి... అంతలో విషాదం

- వెల్దుర్తి మండలం ఉప్పలపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- తెల్లవారుజామున ఆగివున్న లారీని ఢీ కొన్న పెళ్లి బృందం కారు
- ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి
- తీవ్రంగా గాయపడిన 8మంది ప్రయాణికులు
- చికిత్స కోసం నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు
- చిన్నారుల మృతితో అలుముకున్న విషాధం
- మృతుల కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



రేయ్ చిట్టితల్లి లేరా.. చిన్నారి మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదన



మృతి చెందిన లింగా జస్విత



మృతి చెందిన గోనుగుంట్ల హరీష్



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు

మాచర్ల / దుర్గి: రెండు ఇళ్లల్లో పెండ్లి సందడి. మరో రెండు గంటల్లో వివాహం ముగుస్తుంది. అందరిలో ఆనందం. ఐదు కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తే.. పెళ్లి వేదిక. పెళ్లి బృందం అంతా కారులో సంతోషంగా వస్తున్నారు. ఇంతలో అనుకోని ప్రమాదం.. తీవ్ర విషాదాన్ని నింపింది. మండపానికి వెళ్లాల్సిన పెళ్లి కుమారుడు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి పాలవ్వగా.. ఇద్దరు చిన్నారుల మృతి ఆ కుటుంబలో తీవ్ర వేదనను మిగిల్చింది.

వివరాల్లోకి వెళితే... పల్నాడు జిల్లా దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన జిల్లెలమూడి వీరబాబు, తెనాలి ప్రాంతానికి చెందిన స్వప్నతో వివాహం చేసుకునేందుకు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడుకు బయలుదేరారు. పెళ్లి కుమారుడు, పెళ్లి కూతురు మూడు కార్లలో వెళుతున్నారు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో కార్లు వెల్దుర్తి శివారు ప్రాంతం ఉప్పలపాడు రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నాయి. ఒకవైపు తీవ్రమైన పొగ మంచు, అతివేగం కారణంగా రోడ్డుపై ఆగివున్న ట్రిప్పర్‌ను కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారులు గోనుగుంట్ల హరీష్ (12), లింగా జస్విత (3) మృతి చెందారు. పెండ్లి కుమారుడు వీరబాబు, కుటుంబ సభ్యులు జిల్లలమూడి వెంకటరమణ, గోనుగుంట్ల రమణ, బోయపాటి సుజాత, లింగా లక్ష్మి, లింగా పెద్దమ్మ, లింగా నాగేంద్రమ్మలు, డ్రైవర్ చంద్రశేఖర్ అలియాస్ చందు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు సహాయ చర్యలు చేపట్టారు. హుటాహుటిన మాచర్ల ప్రభుత్వాసుపత్రికి వారిని తరలించారు. అక్కడ నుంచి గాయపడిన వారందరిని నర్సరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ వార్త తెలిసి ముటుకూరు గ్రామంలో తీవ్ర విషాధం నెలకొంది. గ్రామస్తులు అధిక సంఖ్యలో ప్రభుత్వాసుపత్రికి తరలివచ్చి రోదిస్తూ ఆవేదన చెందారు. ప్రమాదానికి గురైన కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి.. ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.

ఎనిమిదేళ్లకు కలిగిన సంతానం...

లింగా సైదారావు, లక్ష్మి దంపతులకు వివాహమైన ఎనిమిదేళ్లకు కలిగిన ఏకైక సంతానం జస్విత (3) మృతితో..ఆ కుటుంబంలో విషాదంలో నెలకొంది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తన కూతురు మృత్యువాత పడటంతో ఆ తండ్రిని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. సైదారావు రోదిస్తున్న దృశ్యం.. పలువురిని కలచివేసింది. మరోవైపు తల్లి లింగా లక్ష్మి ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఈమె గ్రామ వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. మరో బాలుడు హరీష్(12) తల్లిదండ్రులు గోనుగుంట్ల నాసరయ్య, రమణ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లి నేపథ్యంలో 6వ తరగతి చదువుతున్న హరిష్ తల్లి రమణతో కలిసి తన బంధువులు ఇంటికి గురువారం చేరారు. హరీష్ తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కుమారుడి మృతితో తండ్రి శోకసంద్రంలో మునిగిపోయాడు. గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారుల మృతితో పాటు ఎనిమిది మంది తీవ్రంగా గాయాలపాలు కావటంతో గ్రామంలో విషాధ ఛాయలు అలముకున్నాయి.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: వైద్యశాలకు వచ్చే రోగులకు నిరంతరం నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ధ్యేయంగా వైద్యశాల సిబ్బంది పని చేయాలని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం చంద్రాజుపాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వైద్యశాలలో ప్రభుత్వం అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం వైద్యశాల ఆపరేషన్ థియేటర్‌లో అవసరమైన పరికరాలు, ఫర్నీచర్ వివరాలు నమోదు చేసుకున్నారు. అదే విధంగా వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బంది, భర్తీ చేయాల్సిన పోస్టులపై చర్చించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడవటి కరీముల్లా బాబుజీ, ఎంపీటీసీ మాదాసు రాంబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ బాషా, పాఠశాల హెచ్‌ఎం జయరామిరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు.. దోమలకు పుట్టినిల్లు

పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



ఇంటిలో నీటి నిల్వలు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి, సిబ్బంది

సత్తెనపల్లి: నీటి నిల్వలు.. దోమలకు పుట్టినిల్లు లాంటివని పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవీందర్ రత్నాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 14వ సచివాలయ పరిధిలో వెంగళరెడ్డి నగర్, వాల్మీకి నగర్‌లో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వాల్మీకి నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్యం, మురుగు కాలువలు, నీటి నిల్వలను పరిశీలించారు. దోమల వల్ల కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెంగళరెడ్డి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ సిరాజున్నీసా మాట్లాడుతూ దోమతెరలు వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకొని.. చికిత్స తీసుకోవాలన్నారు. పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ కిరణ్ బాబు, ఎస్‌ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, శానిటరీ సెక్రటరీ రమేష్, హెల్త్ సెక్రటరీ ఎ.భూలక్ష్మి, ఆశ కార్యకర్త ద్రాక్షావలి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

సత్తెనపల్లి రూరల్ సీఐ రామిశెట్టి ఉమేష్



మాట్లాడుతున్న సీఐ ఉమేష్

సత్తెనపల్లి: రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ రామిశెట్టి ఉమేష్ పేర్కొన్నారు. స్థానిక నలంద ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. రెప్పపాటులో జరిగే ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ కుమార్, ఎస్ఐ ఆవుల బాలకృష్ణ, కానిస్టేబుల్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పాల సేకరణ ఎక్కువగా జరగాలి

జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి శ్రీనివాసరావు




మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పక్కన సత్యనారాయణ.శ్రీదేవి

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పాల సేకరణ ఎక్కువగా జరగాలని జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని 9 మండలాల పంచాయతీ సెక్రెటరీలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, మిల్క్ సెక్రటరీల కు జగనన్న పాల వెల్లువ మూడవ దశపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ అనేది గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు గేదెల పెంపకం చేపట్టే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మూడో విడతలో 9 మండలాల్లోని 49 గ్రామాలను జగనన్న పాల వెల్లువ కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సొసైటీ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఎలా చేయాలి.. కమిషన్ విధానం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో 75 త్యాళ్లూరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీదేవి, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, డివిజన్‌లోని 49 గ్రామాల సెక్రటరీలు హాజరయ్యారు.

మోడల్ స్కూల్ సందర్శన

కెజీబీవీఎస్ సెక్రటరీ, పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి, పక్కన ప్రిన్సిపల్

క్రోసూరు: క్రోసూరు మోడల్ స్కూల్‌ను శుక్రవారం సెక్రటరీ ఆఫ్ కేజీబీవీస్, పాఠ్యపుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి సందర్శించారు. ఆయనతో పాటు పల్నాడు జిల్లా గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీవో) రేవతి పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాఠశాల, హాస్టల్ పరిశుభ్రత, హాస్టల్ స్టాక్ రూం రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కొంత సేపు మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా, చదువులు ఏవిధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని కోరారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు, స్టాఫ్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కేఆర్ ప్రతిష్ట, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్ వద్దు..



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

రాజుపాలెం: వాహనాలను డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడపకూడదని.. సీఐ రామిశెట్టి ఉమేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యం వహిస్తే.. కుటుంబాలు దెబ్బతింటాయని తెలిపారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కలిగి.. డ్రెస్ కోడ్ పాటించాలని స్పష్టం చేశారు. ఆటోల్లో మితిమీరి జనాలను ఎక్కించరాదని, ఎక్కించినట్లైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ ఎస్కే షఫీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సుమారు వంద మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జాన్‌పాల్‌కు సత్కారం



జాన్‌పాల్‌ను సత్కరిస్తున్న సభ్యులు

సత్తెనపల్లి: మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు గోదా జాన్ పాల్‌కు నాట గుర్తింపు పొందిన హెచ్‌ఎస్‌సీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణంలో సత్తెనపల్లి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వర్కింగ్ అధ్యక్షుడు మాలే కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్ బాబు, రూరల్ అధ్యక్షుడు మనకి మహేష్, అచ్చంపేట నాయకులు మాగులూరి చెన్నకేశవులు, యాకోబు, మనకే కన్నా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడిరెక్క దేవదాస్ ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దారుకు సత్కారం

క్రోసూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చేతుల మీదగ ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్న క్రోసూరు డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసరావును మండల వీఆర్వోలు, రేషన్ డీలర్లు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శక్తివంచన లేకుండా విధులు నిర్వర్తించే శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. మరిన్ని పురస్కారాలు అందుకోవాలని, ఉన్నతస్థానానికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పొత్తూరి నాగేశ్వరరావు, వీఆర్వోలు జిలాని, పేరయ్య, సైదులు, ప్రభుదాసు, మస్తాన్‌వలి, కృష్ణారావు, సుభాని, సిబ్బంది హుస్సేనా, రేషన్ డీలర్లు పాశం శ్రీనివాసరెడ్డి, కిషోర్ గౌడ్, వెలదిఅప్పారావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రహదారి భద్రత వారోత్సవాలు



అమరావతి-సత్తెనపల్లి రోడ్డుపై..




క్రోసూరు సెంటర్ మానవ హారం

పెదకూరపాడు: అమరావతి-సత్తెనపల్లి రోడ్డుపై ఎస్ఐ వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో రహదారి భద్రతవారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వవాహన దారులు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. హెల్మెట్, కార్లలో సీటుబెల్ట్ తప్పక పెట్టుకోవాలన్నారు. అలాగే అచ్చంపేట మండలంలో పరిధిలోని ఎస్ఐ పాల్ రవీంద్ర ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై రహదారి భద్రతావారోత్సవాలు నిర్వహించారు. ఆటో వర్కర్స్‌యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాల ర్యాలీ..

క్రోసూరు: రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా క్రోసూరు పోలీసు స్టేషన్ నుంచి సీఐ వీరాస్వామి, ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, సిబ్బంది శుక్రవారం పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం సెంటర్‌లో మానవహారం చేపట్టారు.

డాక్టర్ జండు శాస్త్రి విగ్రహానికి నివాళి



శాస్త్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కుటుంబ సభ్యులు

సత్తెనపల్లి: వామపక్షవాది, సత్తెనపల్లి మాజీ సర్పంచ్ డాక్టర్ చతుర్వేదుల సీతారామశాస్త్రి (జండు శాస్త్రి)53వ వర్ధంతి శుక్రవారం జరిగింది. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల ఆయన విగ్రహానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకి ఉచితంగా వైద్య సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు నరిసేటి వేణుగోపాల్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సయ్యద్ పెద్ద కరిముల్లా పలువురు నాయకులు నివాళులర్పించారు.

మాదలలో ఫ్యామిలీ ఫిజిషియన్



వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి రమాదేవి

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి, వి.సూర్యప్రకాశరావు పాల్గొని, 73 మందికి వైద్య సేవలందించారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎస్ఎం అన్నామణి, రామమ్మ, ఎంపీహెచ్ఎస్ ఎ.పీటర్ డానియేల్, జోస్పిన్ రాణి, ఆశ, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.